



మామిడికుదురు మండలం అప్పనపల్లిలో పది కిలోల మొక్కజొన్న గింజలు, పది కిలోల కిస్మిస్ పండ్లతో తయారు చేసిన శివలింగాలు



వాటర్ ట్యాంకు లోపల వ్యర్థాలను తొలగిస్తున్న కార్మికులు

హంగామా!

- సమయపాలన పాటించిన సిబ్బంది
- ఆర్‌డబ్ల్యుఎస్ ఓవర్ హెడ్ ట్యాంకుల శుభ్రతపై నిర్లక్ష్యం
- గాలికొదిలేస్తున్న పంచాయతీలు
- స్కవర్లను అసలు పట్టించుకోని వైనం
- నీటి కాలుష్యంపై చేసిన ఫిర్యాదులు బుట్టదాఖలు

ఉప్పలగుప్తం, మార్చి 6: అందరికీ సురక్షిత తాగునీరు అందించాలనేది ప్రభుత్వాల అజెండా. కోట్లాది రూపాయలతో తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారు. గ్రామాలకు పైప్‌లైన్లు వేశారు. జనాభా ప్రాతిపదికన గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులనూ నిర్మించారు. ఇంత చేసినా ప్రజలకు సురక్షిత తాగునీరు అందుతోందా అని ప్రశ్నించుకుంటే లేదనే సమాధానం రాక మానదు. ప్రతిరోజూ ఏదో ఒక గ్రామంలో కుళాయిల ద్వారా మురుగునీరు లేదా ఇతర వ్యర్థాలు వస్తున్నాయంటూ అధికారులకు ఫిర్యాదులు. దీనికి బాధ్యత మాది కాదంటే మాది కాదని ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ అధికారులు పరస్పర ఆరోపణలకు దిగడం సర్వసాధారణం. కోట్లు వెచ్చించి ప్రజలకు అందిస్తున్న రక్షిత తాగునీరు కలుషితం కావడానికి కారణాలేమిటి? ఎక్కడ ఈ లోపాలు చోటుచేసుకుంటున్నాయో తెలుసుకుందాం.

ఉదాహరణకు ఉప్పలగుప్తం మండలంలోని చల్లపల్లి ఆర్‌డబ్ల్యుఎస్ ప్రాజెక్టును తీసుకుందాం. ఇక్కడ నుంచి దాదాపు 12 పంచాయతీలకు నిత్యం 3,090 కిలో లీటర్ల తాగునీరు సరఫరా అవుతోంది. గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులకు మెయిన్ పైపులైను ద్వారా నీటిని పంపింగ్ చేస్తారు. అక్కడితో ప్రాజెక్టు సిబ్బంది పని పూర్తవుతుంది. పంచాయతీల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి వీధివీధికీ వేసిన పైపులైన్లు, కుళాయిల ద్వారా ప్రజలకు నీటి సరఫరా జరుగుతుంది. ప్రాజెక్టులో నీటిని ఫిల్టర్ చేసి పంపినప్పటికీ ఓవర్ హెడ్ ట్యాంకుల్లో ఎంతో కొంత మురుగు గోడలకు, అడుగున పేరుకుంటుంది. నాచు పొరలు సైతం ఏర్పడతాయి. ఇందుకోసం ప్రతి పదిహేను రోజులకు ఒక సారి ట్యాంకులను శుభ్రం చేయాలి. ఈ బాధ్యత పంచాయతీలదే. అయితే ఈ 15 రోజుల నియమం నెలకు చేరింది. కనీసం నెలకైనా ట్యాంకుల శుభ్రత జరగట్లేదన్నది అవాస్తవం కాదు. ఎక్కడైనా నీరు రంగు మారిందంటూ ఆందోళన జరిగితే ఆగమేఘాలపై వచ్చి ట్యాంకులను శుభ్రం చేయడం పరిపాటిగా మారింది.



ఇక నీరు కలుషితం కావడానికి మరో కారణం ఉంది. ప్రతి పైపులైను చివర ఏర్పాటుచేసే స్కవర్లు. పైపులైన్ల మరమ్మతులు జరిగినప్పుడు పైపుల ద్వారా మట్టి, ఇతర కాలుష్యాలు చివర ఉన్న స్కవర్లలోకి చేరతాయి. వీటిని నెలకొకసారైనా శుభ్రం చేయకపోతే ఆ వ్యర్థాలు కుళాయిల ద్వారా బయటకు వస్తాయి. ట్యాంకులను అప్పుడప్పుడూ శుభ్రం చేస్తారేమో గానీ స్కవర్లను మాత్రం ఎవరూ పట్టించుకోరు. ఏడాదికోసారి స్పెషల్ డ్రైవ్‌ల పేరుతో అధికారులు ట్యాంకులను శుభ్రం చేయిస్తుంటారు.

నాచు, ఇతర కాలుష్యాలను తొలగించాలి

సురేష్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి

నీటిని ఎంతగా ఫిల్టర్ చేసినా నిల్వ చేసినప్పుడు ఎంతో కొంత పరిమాణంలో వ్యర్థాలు పేరుకోవడం సహజం. ప్రాజెక్టు వద్ద పంపింగ్ సమయంలో అన్ని రక్షిత చర్యలు తీసుకుంటాం. అయితే గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు, స్కవర్లను సకాలంలో పరిశుభ్రం చేయాల్సిన ఆవశ్యకత ఉంది. అలా జరగని కారణంగా ప్రాజెక్టు నీటిలో మలినాలు వస్తున్నాయంటూ మమ్మల్ని బాధ్యులు చేస్తున్నారు. ఈ విషయంలో పంచాయతీలు తగిన చర్యలు తీసుకోవాలి.

ట్యాంకుల క్లీనింగ్‌లో సమయపాలన పాటించేలా చర్యలు

కె.వెంకటేశ్వరప్రసాద్, ఎంపీడీవో

ఓవర్ హెడ్ ట్యాంకుల క్లీనింగ్ ఇటీవల సజావుగానే జరుగుతోంది. క్రమం తప్పకుండా ట్యాంకులను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. స్పెషల్ డ్రైవ్‌లో 46 ట్యాంకులను శుభ్రం చేయించాం. స్కవర్ల విషయంలోనూ పంచాయతీలను అప్రమత్తం చేస్తాం. ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం.

385 పంచాయతీల్లో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల క్లోరినేషన్

అమలాపురం రూరల్, మార్చి 6: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని 385 గ్రామ పంచాయతీల్లో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో బుధవారం శుభ్రం చేయించి క్లోరినేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు తెలిపారు. డీఎల్పీవో పి.బొజ్జిరాజు, ఈవోపీఆర్డీ జి.మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులు, సాగునీటి ఇబ్బందులు, ఎరువులు ధరల దరువు... ఇలా అనేక కష్టాలను ఎదుర్కొని అన్నదాతలు అరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ ఆంక్షల నడుమ విక్రయిస్తున్నారు. ఆ డబ్బులను సర్కారు సకాలంలో చెల్లించకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక రైతులు నానా అవస్థలు పడుతున్నాడు. మొదటి పంట పూర్తయి మూడు నెలలు కావస్తున్నా సంబంధిత రైతుల ఖాతాల్లోకి ప్రభుత్వం ఇంకా డబ్బులు జమ చేస్తూనే వుంది. పి.గన్నవరం మండలంతో పాటు జిల్లాలో పలుచోట్ల రైతులకు ధాన్యం సొమ్ము జమ కాలేదు.



పి.గన్నవరం మండలంలో ధాన్యం పట్టుబడి (పాత చిత్రం)

ధాన్యం సొమ్ము చెల్లించండి...

మహాప్రభో!

- మూడు నెలలు కావొస్తున్నా...ఇంకా డబ్బులు పడలేదు
- అన్నదాతల ఆవేదన
- జిల్లావ్యాప్తంగా 2,19,800 టన్నుల ధాన్యం కొనుగోలు
- 56,491 మంది రైతులకు రూ.479.81 కోట్లు జమ
- 281 మంది రైతులకు రూ.2.18 కోట్లు బకాయి

పి.గన్నవరం, మార్చి 6: ధాన్యం కొనుగోలు సమయంలో ప్రభుత్వం అనేక ఆంక్షలు పెడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది. తీరా డబ్బులు వేసే సమయంలో కొంతమంది రైతులను అవస్థలకు గురి చేస్తోంది. ధాన్యం కొనుగోళ్ల సమయంలో వారం వ్యవధిలోనే ప్రభుత్వం రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమచేసేది. క్రమేపీ సొమ్ముల చెల్లింపులో జాప్యం చేసుకుంటూ వచ్చింది. మొదటి పంట పూర్తయ్యింది. రెండో పంట కొన్నిచోట్ల పొట్ట దశలో వుండగా మరికొన్నచోట్ల 40 రోజులు పూర్తి చేసుకుందని... ధాన్యం సొమ్ము ఇంకా అందలేదని రైతులు వాపోతున్నారు. మొదటి పంటకు పెట్టుబడి నిమిత్తం తెచ్చిన అప్పులు చెల్లించకుండానే రెండో పంట నడుస్తోందని... తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క ఎరువులు షాపుల్లో అప్పు చెల్లించాలని, మరో పక్క కౌలు శిస్తు డబ్బు చెల్లించాలని... ఇలాగైతే తమకు ప్రభుత్వం ఏ విధంగా భరోసా ఇస్తుందని ప్రశ్నిస్తున్నారు. బ్యాంకు ఖాతాల్లోకి కంటితుడుపుగా డబ్బులు జమ చేస్తే సరిపోదని, సకాలంలో ధాన్యం సొమ్ములు చెల్లించాలని కోరుతున్నారు. పి.గన్నవరం మండలంలోని మానేపల్లి, వాడ్రేవుపల్లి, నాగుల్లంక, పి.గన్నవరం గ్రామాలతో పాటు మామిడికుదురు మండలంలోని పెదపట్నంలో పలువురు రైతులకు ధాన్యం డబ్బులు జమ కాలేదు. దీంతో వారంతా అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.



జిల్లావ్యాప్తంగా మొదటి పంటకు 56,491 మంది రైతులనుంచి ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా సివిల్ సప్లయిస్ అధికారులు కొనుగోలు చేశారు. వీరిలో 56,199 మంది రైతులకు రూ.479.81 కోట్లు జమ చేసినట్టు అధికారులు చెప్తున్నారు. ఇంకా 281 మంది రైతులకు రూ.2.18 కోట్లు ఇవ్వాల్సి ఉంది. నిధులు లేక జమ చేయలేదని, వారంలో ఇస్తామని అధికారులు వివరిస్తున్నట్టు రైతులు చెప్తున్నారు.

రూ.2.83 లక్షలు రావాలి

మట్టపర్తి మధుబాబు, కౌలు రైతు, నాగుల్లంక



నాగుల్లంకలో 7.5 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాం. మొదటి పంటలో గోదావరి వరదలకు ఆకుమడులకు పూర్తిగా నష్టం వాటిల్లింది. అనంతరం ఆకు బయట కొనుగోలు చేసి నాట్లు పూర్తి చేసుకున్నాం. గతేడాది డిసెంబరు 31న రైతు భరోసా కేంద్రం ద్వారా ధాన్యం విక్రయించాం. రూ.2.83 లక్షలకు గాను ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రాలేదు. కౌలు శిస్తు చెల్లించకపోవడంతో భూమి గల రైతుతో ఇబ్బందిపడుతున్నాం. అధికారులు స్పందించి మా వ్యక్తిగత ఖాతాల్లోకి సొమ్మును వెంటనే జమ చేయాలి.

రెండో పంటకు ఎక్కడి నుంచి అప్పు తేవాలి

ఆరుమిల్లి వెంకటనారాయణ, కౌలు రైతు, నాగుల్లంక



నాకు 40 సెంట్ల భూమి ఉండగా నాలుగు ఎకరాల్లో కౌలు వ్యవసాయం చేస్తున్నాను. మొదటి పంటకు తెచ్చిన అప్పు ఇంకా తీరలేదు. రెండో పంటకు ఎక్కడి నుంచి తేవాలి. మొదటి పంటకు ధాన్యం సొమ్ము రూ.1.50 లక్షలు రావాల్సి వుంది. మూడు నెలలు అయినా ఒక్క రూపాయి కూడా జమ కాలేదు. ఇలాగైతే మా పరిస్థితి ప్రశ్నార్థకమే. అధికారులు స్పందించకపోతే ఇబ్బందులు తప్పవు.



ఎలుక కొట్టేసిన వరి పొలం

వరి పొలాలకు ఎలకొట్టుడు!

70 రూపాయలు ఇస్తేనే గానీ పట్టేది లేదంటున్న వైనం... అడిగినంతా ఇవ్వక తప్పట్లేదంటున్నరైతులు

కె.గంగవరం, మార్చి 6: నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరగడం మనం చూస్తాం... కానీ ఇప్పుడు ఎలుకల ధర పెరిగింది. అదేంటి అనుకుంటున్నారా! అదేనండీ ఒక్క ఎలుకను పట్టుకోవడానికి రూ.70 వసూలు చేస్తున్నారు. దీంతో రైతులు వామ్మో అంటున్నారు. ఆరుగాలం శ్రమించి పంట పండించే రైతులకు ఆది నుంచీ ఎన్నో కష్టాలు. ప్రస్తుతం వరి రైతులను ఎలుకలు కలవరపెడుతున్నాయి. ఏపుగా పెరిగిన వరి పొలాలను ఎలుకలు నరికి పాడేస్తున్నాయి. ఎలుకల కొట్టడం వల్ల ఎకరాకు రెండు నుంచి నాలుగు బస్తాల వరకు దిగుబడి తగ్గిపోతోందని రైతులు వాపోతున్నారు. వాటిని పట్టించడానికి ఖర్చులు పెరిగిపోయాయి. ఒక ఎకరాకు ఎలుకలు పట్టించుకోవడానికి సుమారు రూ.3వేలు నుంచి రూ.4వేలు వరకు వ్యయమవుతోంది. ఎలుకలు సామూహిక నిర్మూలన కార్యక్రమం నిర్వహించినా అది ఆశించిన ఫలితాలు ఇవ్వట్లేదు. దీంతో రైతులు ఎలుకలు పట్టేవారినే ఆశ్రయిస్తున్నారు. దీంతో వారికి డిమాండ్ పెరిగింది. 70 రూపాయలు ఇస్తేనే గానీ ఎలుకను పట్టేది లేదంటున్నారు. దీంతో పంటను రక్షించుకోవడానికి వారు అడిగినంతా ఇవ్వక తప్పట్లేదని రైతులు చెప్తున్నారు.



వరి చేలో పొగ పెట్టి...



ఎలుకను పట్టి...



ఇన్‌పుట్ సబ్సిడీ నమూనా చెక్కు అందజేస్తున్న జేసీ నుపూర్‌అజయ్

రైతుల ఖాతాల్లో రూ.20.25 కోట్ల

ఇన్‌పుట్ సబ్సిడీ

అమలాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని వారి బ్యాంకు ఖాతాలకు బుధవారం జమ చేసినట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ తెలిపారు. వర్చువల్ విధానంలో కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జిల్లాలో తుఫాన్ ప్రభావంతో 23,379 మంది రైతులకు చెందిన 11,668.77 హెక్టార్ల విస్తీర్ణంలో వరి, ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయని, వాటికి ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.20.25 కోట్లు నష్టపరిహారంగా చెల్లించారన్నారు. 19,849 మంది రైతులకు చెందిన 10,503 హెక్టార్ల విస్తీర్ణంలో వ్యవసాయ పంటలు దెబ్బతినగా రూ.17.85 కోట్లు, 3,530 మంది రైతులకు చెందిన 1164 హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతినగా రూ.2.39 కోట్లు పరిహారంగా అందించారని జేసీ తెలిపారు. ఇన్‌పుట్ సబ్సిడీ నమూనా చెక్కును రైతులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు, సహాయ సంచాలకుడు కాకి నాగేశ్వరరావు, వెంకట రామారావు, హితకారిణి సమాజం ఛైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, అమలాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్‌ఖాదర్, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, జిల్లా ఉద్యానవన అధికారి బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన బీసీ సంఘీయులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల



టీడీపీకి బీసీలు రెండు కళ్లు

'జయహో బీసీ' సదస్సులో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, మార్చి 6: 'టీడీపీకి బీసీలే వెన్నుదన్ను... వారు పార్టీకి రెండు కళ్లు... వారిని పార్టీ ఎప్పటికీ మరువదు' అని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట నియోజకవర్గ స్థాయి 'జయహో బీసీ' సదస్సు పట్టణంలోని సూర్య కన్వెన్షన్ హాలులో బీసీ సెల్ అధ్యక్షుడు గుడాల జయబాబు అధ్యక్షతన బుధవారం జరిగింది. శెట్టిబలిజ సంఘం రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి వాడ్రేవు వీరబాబు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల టీడీపీ-జనసేన అధినేతలు మంగళవారం ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో పొందుపరిచిన వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తానన్నారు. తన విజయంలో బీసీల పాత్ర మరువలేనని చెప్పారు. తనను నాలుగోసారి గెలిపిస్తే మండపేట నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతానని చెప్పారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. దేవాలయాల అభివృద్ధికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రూ.8కోట్లు తెచ్చారని, వాటి వివరాలు వెల్లడించాలని వేగుళ్ల డిమాండ్ చేశారు. విద్యుత్ కోసం మంజూరు చేయించిన రూ.5 కోట్లు వివరాలు చెప్పాలన్నారు. త్రిమూర్తులు బీసీ, ఎస్సీ వ్యతిరేకి అన్నారు. వైసీపీ పాలనలో ప్రతిపక్ష ఎమ్మె ల్యేలకు రూపాయి కూడా నిధులు ఇవ్వలేదన్నారు.

శెట్టిబలిజ సంఘం రాష్ట్ర కన్వీనర్ కూడిపూడి సత్తిబాబు మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్‌ను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసి 56 కార్పొరేషన్లుగా విడదీసిందన్నారు. ఛైర్మన్లను పదవులకే పరిమితం చేసి కూర్చునేందుకు కుర్చీలు కూడా లేకుండా చేసిన ఘనత ఈ ప్రభుత్వానిది అని ఎద్దేవా చేశారు. అమలాపురం పార్లమెంటరీ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో బీసీలంతా టీడీపీ వెంటే ఉండి పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ బీసీలకు వైసీపీ ప్రభుత్వంలో తీరని అన్యాయం జరిగిందన్నారు. చేనేత, కల్లు గీత కార్మికులతో పాటు అనేక వర్గాలకు చెందిన వారికి జరిగిన అన్యాయాలను ఏకరవు పెట్టారు. టీడీపీ-జనసేన ద్వారానే బీసీల అభ్యున్నతి సాధ్యమని బీసీ సంఘాల నేతలు అన్నారు. తొలుత ఎన్టీఆర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సదస్సులో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ రెడ్డిప్రసాద్, వాదా ప్రసాదరావు, ఉంగరాల రాంబాబు, కాళ్లకూరి శ్రీను, వాకచర్ల గుప్తా, జొన్నపల్లి సూర్యారావు, బీసీ సంఘాల నాయకులు కాదా ప్రభాకరరావు, వైఆర్కే పరమహంస, యరగతపు బాబ్జీ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సూరంపూడి గనిరాజు, చింతా వీరభద్రరావు, కుక్కల రామారావు, బండి గోవిందు, వాసా రవికిరణ్, కాశిన కాశీవిశ్వనాథం, జేసీ ప్రసాద్, తాపేశ్వరం సర్పంచ్ వాసంశెట్టి రాజేశ్వరిశ్రీనివాస్, రొంగలి శ్రీనివాస్, అరి సుబ్రహ్మణ్యం, నేతలు, మహిళలు పాల్గొన్నారు.



శివరాత్రికి సన్నద్ధం

- శైవాలయాల్లో శివరాత్రి ఏర్పాట్లు పూర్తి
- విద్యుత్ దీపాలంకరణతో ప్రత్యేక ఆకర్షణ
- ప్రత్యేక శోభను సంతరించుకున్న ద్రాక్షారామ, కోటిపల్లి క్షేత్రాలు
- క్యూలైన్ల ఏర్పాటు





ద్రాక్షారామకు ప్రత్యేక శోభ

ద్రాక్షారామ, మార్చి 6: త్రిలింగ క్షేత్రం, పంచారామం, దక్షిణ కాశీగా వెలుగొందుతున్న ద్రాక్షారామ భీమేశ్వరాలయం శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవానికి సిద్ధమయ్యింది. ద్రాక్షారామలో భీమేశ్వరస్వామి వారు స్వయంభువునిగా కొలువుదీరారు.. మాణిక్యాంబ అమ్మవారు అష్టాదశ శక్తిపీఠాలలో ద్వాదశ శక్తి పీఠంగా పూజలు అందుకుంటున్నారు. శివరాత్రి పర్వదినాన సప్తగోదావరిలో పుణ్యస్నానమాచరించి భీమేశ్వరుని దర్శిస్తే సర్వపాపాలు హరిస్తాయని కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. భీమేశ్వరాలయంలో శివరాత్రిని పురస్కరించుకుని తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతసేవ, ప్రాత:కాలార్చన, తీర్థపుబిందె, ప్రథమ అభిషేకం, బాలభోగం కార్యక్రమాలు జరుగుతాయి. 4.00 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భీమేశ్వరస్వామి వారికి భక్తులచే అభిషేకములు, ఏకాదశ రుద్రహోమం. పూజలు జరుగుతాయి. రాత్రి 8.30 గంటలకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ జరుగుతుంది. రాత్రి 10.30 గంటలకు స్వామివారి రాజభోగం నిమిత్తం 11 నుంచి రాత్రి 12 గంటల వరకు స్వామి దర్శనానికి విరామం. 12 గంటల నుంచి రాత్రి 1.30 వరకు స్వామి దర్శనానికి అనుమతిస్తారు. ఆలయానికి తరలి వచ్చే అశేషమైన భక్తులకు స్వామి దర్శనం చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉచిత, శీఘ్ర, విశిష్ట దర్శనానికి వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ అధికారి, ఉప కమిషనర్ ఎం.విజయరాజు, ఈవో పి.టి.వి సత్యనారాయణ తెలిపారు. భక్తులకు సేవలు అందించేందుకు పరిసర ఆలయాల సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ, పిల్లలకు పాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ద్రాక్షారామ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు. ఫైండా వారి అన్నసత్రంలో అన్నదానం జరిపేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు.



కోటి ఫలితాలనిచ్చే క్షేత్రం

కె.గంగవరం, మార్చి 6: కోటిపల్లి పుణ్యక్షేత్రంలో ఏ పుణ్య కార్యం చేసినా కోటిఫలితాలు సిద్ధిస్తాయని ప్రజల విశ్వాసం. గోదావరి నది ఒడ్డున ఉన్న కోటిపల్లి పుణ్యక్షేత్రంలో శ్రీఛాయా సోమేశ్వరస్వామి ఆలయం, రాజరాజేశ్వరి అమ్మవారు, భూదేవి సమేత సిద్ధి జనార్ధనస్వామి, కోటేశ్వరస్వామి, నవగ్రహాలయం ఉన్నాయి. ఆలయం వెలుపల గోశాల ఏర్పాటు చేశారు. భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుంటారు. మహాశివరాత్రి పర్వదినాన సుమారు లక్ష మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారని అధికారులు అంచనాలు వేస్తున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలివే..

7 నుంచి 9వ తేదీ వరకూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 7 గురువారం ఉదయం 5 గంటలకు గౌతమి నది నుంచి తీర్థపు బిందె తీసుకువచ్చి స్వామి వారికి బాలభోగము నిర్వహిస్తారు. అనంతరం 6 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 4.30 లకు స్వామి వారి రథోత్సవం, 8న శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు మేళ తాళాలతో గోదావరి నదిలో నుంచి తీర్థపు బిందెను తీసుకువచ్చిన అర్చకులు స్వామి వారికి అభిషేకము, బాలభోగము నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు 4 గంటల నుంచి దర్శనం కల్పిస్తారు. రాత్రి 7 గంటలకు బేడా మండపంపై కోటి దీపార్చన, రాత్రి 9 గంటలకు లక్షపత్రి పూజ నిర్వహిస్తారు.

వాహనాల దారి మళ్లింపు

శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు పామర్రు ఎస్‌ఐ జానీబాషా తెలిపారు. 7 గురువారం రాత్రి 9 గంటల నుంచి రావులపాలెం నుంచి యానాం ఏటిగట్టు మీదుగా వెళ్లే వాహనాలను కూళ్ల గ్రామం నుంచి పామర్రు, గంగవరం గ్రామాల మీదుగా, యానాం నుంచి రావులపాలెం ఏటిగట్టు మీదుగా వెళ్లే వాహనాలను కోట గ్రామం నుంచి గంగవరం, పామర్రు గ్రామాల వైపుగా మళ్లిస్తున్నారు. అదే విధంగా కాకినాడ నుంచి అమలాపురం వైపుగా గోదావరి పంటుపై ప్రయాణం చేసే వాహనాలను పాతకోట ఏటిగట్టు నుంచి దంగేరు మీదుగా యానాం వైపునకు, అమలాపురం నుంచి కాకినాడ వైపునకు గోదావరి పంటు దాటే వాహనాలను ముక్తేశ్వరం నుంచి యానాం వైపుగా దారి మళ్లిస్తున్నట్లు ఆయన చెప్పారు. కోటిపల్లి నుంచి ముక్తేశ్వరం రేవులో ప్రయాణికులను మాత్రమే దాటిస్తామని చెప్పారు. రేవు ట్రాఫిక్ నియంత్రణ ఉన్నందుకు వాహనదారులు, ప్రయాణికులు గమనించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

మహా పుణ్యక్షేత్రం
కుండలేశ్వరం

కాట్రేనికోన, మార్చి 6: కుండలేశ్వరం వచ్చి వృద్ధగౌతమిలో స్నానం చేసి కుండలేశ్వరుని కరుణాకటాక్షాల కోసం అర్రులు చాస్తున్నామని పవిత్ర కాశీ పండితులు అంటుంటే తాను ఎంతో ఆశ్చర్యపోయానని ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు వ్యాఖ్యానించారంటే కుండలేశ్వర మహాత్మ్యం ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. అందుకే చాగంటి తరచూ కుండలేశ్వరంలో పూజలు నిర్వహించడమే కాకుండా స్వయంగా ఆయన ఇక్కడ కొన్ని నిర్మాణాలను చేపట్టారు. అమలాపురానికి సమీపంలో వృద్ధగౌతమీ నదీ తీరాన వెలసిన కుండలేశ్వరం క్షేత్రంలో సూర్యుని కుండలాల ఆకారంలో శివలింగాన్ని గౌతమ మహాముని ప్రతిష్ఠించడం విశేషం. బ్రహ్మాండ పురాణంలో వ్యాసమహర్షి ఈ క్షేత్రం గురించి వివరించారు. ఇప్పటికీ అర్ధరాత్రి వేళ ఈ క్షేత్రం సమీపంలో నదీ గర్భంలో ఓంకార నాదాలు వినిపిస్తాయని అంటుంటారు. ఈ ఆలయాన్ని అర్చకులే అభివృద్ధి చేయడం మరో విశేషం. కాళ్ళకూరి కుటుంబం ఆలయ అభివృద్ధికి పాటుపడుతోంది. మహాశివరాత్రి రోజున ఎందరో భక్తులు కుండలేశ్వరం వచ్చి స్వామిని దర్శించుకుంటారు. అయితే ఇక్కడ నదీతీరం ప్రమాదకరంగా ఉంది. భక్తుల కోసం ఇక్కడ శాశ్వత స్నానఘట్టాలు నిర్మించాల్సిన అవసరం ఉంది.



ఘనంగా కుక్కుటేశ్వరుని కల్యాణం



కుక్కుటేశ్వర స్వామివారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే దొరబాబు, ఎంపీ గీత



పిఠాపురం, మార్చి 6: కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అలంకారం చేసి ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై ఆశీనులు గావించారు. వేద పండితులు చెరుకుపల్లి వెంకటేశ్వర్లు, ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనాపాఠి ఆధ్వర్యంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పట్టువస్త్రాలు, మంగళసూత్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకువచ్చి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. కల్యాణోత్సవంలో ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబుతో పాటు కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు పులి నారాయణమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు కల్యాణానికి ముందు వాసవి మహిళా భక్త బృందం సభ్యులు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

మండపేట, మార్చి 6: మండపేట మండలం తాపేశ్వరం గ్రామంలో విఘ్నేశ్వర మోడ్రన్ రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి రూ.35.15,687 విలువైన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అధికారులు వివరాలు వెల్లడించారు. సివిల్ సప్లయి అధికారులతో కలిసి తాపేశ్వరంలో ఉన్న రైస్ మిల్లును తనిఖీ చేస్తుండగా వెలగతోడు గ్రామానికి చెందిన ఏరుబడి సురేష్ ద్విచక్ర వాహనంపై 120 కిలోల రేషన్ బియ్యం విక్రయించేందుకు తీసుకువచ్చాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా వెలగతోడులో రేషన్‌కార్డుదారుల నుంచి రేషన్ బియ్యం కిలో రూ.16 వంతున కొనుగోలు చేసి మిల్లు వద్ద రూ.20కి విక్రయిస్తున్నట్లు చెప్పాడు. తాపేశ్వరంలో రైస్‌మిల్లు నిర్వాహకుడు అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన కర్రి దత్తాత్రేయ గురుకృష్ణారెడ్డి తానే రేషన్ బియ్యంను కొనుగోలు చేసినట్టు అంగీకరించారని అధికారులు తెలిపారు. మిల్లులో రికార్డులను పరిశీలించగా లభ్యం అయిన 267.87 క్వింటాళ్ల బియ్యం, సుమారు రూ.35,15,687 వరకు బియ్యం విలువ ఉంటుందని అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో లభ్యమైన వాహనాలను సీజ్ చేసి 6ఎ కింద కేసు నమోదు చేసి బియ్యం విక్రయించే వ్యక్తితో పాటు, మిల్లు యజమానిపై కేసులు నమోదు చేశామని అధికారులు తెలిపారు. దాడుల్లో రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ ఎస్పీ కె.ఎస్.ఎస్.వి.సుబ్బారెడ్డి, మాట్లాడుతూ రేషన్‌బియ్యం క్రయ, విక్రయాలు నిల్వలపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. బియ్యం కొనుగోలు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాలనాయుడు. నాగవెంకటరాజు, విజయ్‌కుమార్, జగన్నాథరెడ్డి, సీఎస్‌డీటీ అలీషా పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.10 లక్షలు



విరాళం అందిస్తున్న దాతలు

ఆత్రేయపురం, మార్చి 6: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన నార్కెడుమిల్లి రామకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు రూ.10 లక్షలు విరాళం సమర్పించారు. దాతలకు వేదాశీర్వచనం అనంతరం స్వామివారి చిత్రపటాన్ని ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మన్యం సూర్యకుమారి భాను, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు. బుధవారం వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,00,144 లభించింది.

నేడు ప్రసాద్ స్కీం పనులకు మోదీ శంకుస్థాపన

అన్నవరం, మార్చి 6: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం పలు అభివృద్ధి పనులను గురువారం దేశ ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రసాద్ స్కీం ద్వారా ఈ నిధులు మంజూరయ్యాయి. 8 ఏళ్లుగా ఊరిస్తూ వస్తున్న నిధులను ఎట్టకేలకు రూ.90 కోట్ల నుంచి ముందుగా రూ.50 కోట్లకు కుదించి చివరగా రూ.20 కోట్లతో సరిపెట్టారు. ఈ నిధులను టీటీడీ సత్రం ప్రదేశంలో అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్, ప్రకాష్‌సదన్ వద్ద మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్ బస్సులకు ఖర్చు చేయనున్నారు. గురువారం ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమాలను వార్షిక కల్యాణవేదిక ప్రాంగణంలో చేపట్టనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. 11.30కి ఎమ్మెల్యే, ఎంపీల ప్రసంగం అనంతరం 11.45కు ప్రధాని మోదీ ప్రసంగం వర్చువల్‌గా ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ మేరకు ఇప్పటికే భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, మార్చి6: తుని రైల్వేస్టేషన్ పరిధిలో హంసవరం, అన్నవరం రైల్వే స్టేషన్ల మధ్యలో పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని వ్యక్తిని గూడ్స్ రైలు ఢీకొనడంతో మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.82 కోట్లు

అన్నవరం, మార్చి 6: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా రూ.1,82,53,964 నగదు, 19 గ్రాముల బంగారం, 1580 గ్రాముల వెండి సమకూరాయి. వీటితో పాటుగా యుఎస్‌ఏ 137 డాలర్లు, సింగపూర్ 39, సెంట్రల్‌బ్యాంక్ ఒమెన్ 800 లభించాయి. లెక్కింపును ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది లెక్కించారు. 34 రోజులకు ఈఆదాయం సమకూరగా స్వామివారికి సరాసరిన రోజుకు రూ.5.07 లక్షలు హుండీలలో కానుకలను భక్తులు సమర్పించారు.

అంగరంగ వైభవంగా భీమేశ్వరుని కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

- శోభాయమానంగా సామర్లకోట ఆలయ ప్రాంగణం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

సామర్లకోట, మార్చి 6: కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి, బాలా త్రిపురసుందరి అమ్మవార్ల దివ్య కల్యాణోత్సవం బుధవారం రాత్రి వేలాదిమంది భక్తుల నడుమ, వేద పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో రాత్రి 11 గంటలకు కల్యాణోత్సవాన్ని ఆలయ పండితులు శ్రీపాద రాజశేఖర్ ఘనాపాఠి, వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు తదితరుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం నుంచి వచ్చిన వేద పండితులు స్వామి వారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే స్థానిక చంద్రశేఖరస్వామి ఆలయం నుంచి పండితులు పట్టువస్త్రాలు అందజేశారు. కల్యాణ ప్రక్రియ కథా వృత్తాంతాన్ని తణుకుకు చెందిన పండితులు శర్మ సమగ్రంగా వివరించారు. కల్యాణానికి ముత్యాల తలంబ్రాలను గంజి బూరిబాబు కుటుంబ సభ్యులు అందజేశారు. ఆ కల్యాణోత్సవంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, దవులూరి సుబ్బారావు, బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ, పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాస్, విద్యుల్లత దంపతులు, కటకం సతీష్ తదితరులు పాల్గొన్నారు. కల్యాణ పూజల అనంతరం హాజరైన భక్తులకు ప్రసాదాలు, కల్యాణ ముత్యాల తలంబ్రాలు, రుమాళ్లను భక్త సంఘం పంపిణీ చేసింది. ఈ కల్యాణోత్సవంలో అమలకంటి శ్రీనివాసరావు, కంచర్ల నాగజగన్నాథ గుప్త తదితరులు పాల్గొన్నారు.

రెండో స్థానంలో కాకినాడ టౌన్ బ్యాంకు

ది కాకినాడ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర

కాకినాడ సిటీ, మార్చి 6 : తమ బ్యాంకు మొత్తం టర్నోవర్ రూ.1740 కోట్లుగా ఉందని, రాష్ట్రంలో ఉన్న అర్బన్ బ్యాంకుల్లో కాకినాడ టౌన్ బ్యాంకు 2వ స్థానంలో నిలిచిందని ది కాకినాడ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర వెల్లడించారు. కాకినాడ గాంధీనగర్ యూనివర్శల్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం కాకినాడ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర బ్యాంకు ఆర్థిక లావాదేవీల వివరాలు తెలియజేశారు. రిజర్వ్ బ్యాంకు వారి కేటగిరైజేషన్ ప్రకారం టైర్-3 బ్యాంకుగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఖాతాదారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఇటీవలే ఫోన్-పే, గూగుల్-పే సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. గత నెల ఫిబ్రవరి 29 నాటికి బ్యాంకు నెట్ ఎన్‌పీఏవో-91గా, సీఆర్ఏఆర్ 18.27 శాతంగా ఉందన్నారు. సమావేశంలో బ్యాంకు వైస్ ప్రెసిడెంట్ తోట సుధీర్, డైరెక్టర్లు గారపాటి అచ్యుత కల్యాణ్‌ప్రసాద్, సత్తి రామారెడ్డి, రిమ్మలపూడి ధర్మేంద్ర, అయ్యగారి వెంకటేష్, బ్యాంకు సభ్యులు వి.కృష్ణ, ఎన్ జనార్ధనరెడ్డి, బ్యాంకు సీఈవో సి.సుగుణరావు, అసిస్టెంట్ ఎల్‌టీవో బి సుహాస్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర తదితరులు

ఎన్నికల వేళ విలేకర్లకు తాయిలాలు

గిఫ్ట్ బాక్సులు పంపిణీ చేసిన ఎంపీ భరత్





రాజమహేంద్రవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ వైసీపీ నాయకుల ప్రలోభాల పర్వం నిస్సిగ్గుగా నడుస్తోంది. తూర్పు గోదావరి జిల్లా రాజ మహేంద్రవరం రూరల్ వైసీపీ ఇన్‌చార్జి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తాను ప్రాతినిథ్యం వహిస్తున్న సమాచార శాఖ వాహనంలో గిఫ్టులను తరలించి ఏకంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. వాటిని వలంటీర్లు, ప్రభుత్వ, సచివాలయ సిబ్బందిని ప్రసన్నం చేసుకోవడానికి వినియోగించారు. నేనేం తక్కువ తిన్నానా అంటూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎంపీ భరత్ రామ్ విలేకరులకు దుస్తులు పంపిణీ చేశారు. ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో కొంత మంది రిపోర్టర్లకు చీర, ఫ్యాంటు షర్టు బిట్లు ఉన్న సంచిని అందజేశారు. ఒక్కో ప్యాక్ విలువ సుమారు రూ.3 వేలు ఉంటుంది. అప్పుడు కొంత మందికి అందకపోవడంతో వారికి బుధవారం ఇచ్చారు. ఈ గిఫ్టులను వైసీపీ సెంట్రల్ ఆఫీసు నుంచి పంపించారని చెబుతున్నారు. నెల కిందట జిల్లా వైసీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కూడా రిపోర్టర్లకు కాస్త పెద్ద మొత్తం విలువ చేసే గిఫ్టులను చేతికిచ్చారు. కొందరికి ఇళ్లకు తీసుకెళ్లి మరీ అందజేశారు. అవి కూడా వైసీపీ సెంట్రల్ ఆఫీసు నుంచి వచ్చాయని సమాచారం. ఆ గిఫ్టుప్యాక్‌లో ఇయర్ ఫోన్లు, పవర్‌బ్యాంకు, ట్రైపాడ్, వాచీ.. ఇలా సుమారు రూ.8-10 వేలు విలువ చేసే వస్తువులు ఉన్నాయి. సుమారు 30 మందికి వీటిని పంచారు. వైసీపీ నుంచి సీటు ఆశిస్తున్న నాయకులు వలంటీర్లు, మీడియా, సచివాలయ సిబ్బంది, అంగ న్వాడీలు, ఆశా వర్కర్లకు ఎక్కడికక్కడ గిఫ్టులు ముట్టజెబుతున్నారు. తమకు అనుకూలంగా పని చేయాలని మౌఖికంగా హుకుం జారీ చేస్తున్నారు. అంతా బహిరంగంగా చేస్తున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్టు వదిలేయడం గమనార్హం.

మహిళ హత్య కేసులో అల్లుడికి జీవితఖైదు

పిఠాపురం, మార్చి 6: మహిళ హత్య కేసులో అల్లుడికి జీవితఖైదు విధిస్తూ పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఏ.వాసంతి తీర్పు చెప్పారు. భార్యను చంపిన కేసులోనూ అతను ముద్దాయిగా ఉన్నాడు. పిఠాపురం పట్టణంలోని లయన్స్ కల్యాణమండపం ఏరియాలో నివాసముండే కేతినీడి ఉమాదేవి(71) తన కుమార్తె ఆళ్ల హేమమాలిని, అల్లుడు ఆళ్ల నారాయుడితో కలిసి జీవించేది. 2017 మార్చి 17వ తేదీన ఉమాదేవి అనుమానాస్పద స్థితిలో మరణించింది. అయితే ఉమాదేవితో కుమార్తె, అల్లుడు ఆస్తి విషయంలో గొడవపడినట్లు, దీంతో ఆమె మృతిపై తమకు అనుమానం ఉందని ఉమాదేవి సోదరుడు అడబాల ఉమామహేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఎస్‌ఐ శోభన్‌కుమార్ కేసు నమోదు చేయగా అప్పటి సీఐ బోను అప్పారావు దర్యాప్తు చేసి కుమార్తె, అల్లుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు విచారణలో ఉండగానే ఆళ్ల హేమమాలిని 2022లో హత్యకు గురయింది. వాదోపవాదాలు అనంతరం నేరం రుజువు కావడంతో ప్రధాన నిందితుడైన నారాయుడికి 302 సెక్షన్ కింద జీవిత ఖైదు, వేయి రూపాయల జరిమానా, 201 సెక్షన్ కింద 5 సంవత్సరాల జైలు శిక్ష, వేయి రూపాయిలు జరిమానా విధిస్తూ అదనపు జిల్లా జడ్జి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే మరో రెండేళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. కాగా జీవితఖైదు పడిన నారాయుడు తన భార్యను హత్య చేసిన కేసులోనూ నిందితుడిగా ఉన్నాడు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ అనిశెట్టి కాశీవిశ్వనాథరెడ్డి వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు చేసిన అధికారులతో పాటు స్పీడ్ ట్రైల్ అయ్యేలా చూసిన పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్‌ఐ మురళీమోహన్, ఏఎస్‌ఐ వి.దుర్గారావు, పీపీలను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

టెంట్‌హౌస్ దగ్ధం: రూ.15 లక్షల నష్టం

ఆత్రేయపురం, మార్చి 6: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరంలో బుధవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించి టెంట్‌హౌస్ దగ్ధమైంది. చిట్టూరి ఊదరాజు సొసైటీ గోదాము సమీపంలోని తాటాకు పాకలో సప్లయి కంపెనీ నిర్వహిస్తున్నాడు. అగ్నిప్రమాదంలో ఆటో, మూడు జనరేటర్లు, ఒక మోటారు సైకిల్, విలువైన సామగ్రి దగ్ధమయ్యాయి. సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8 కిలోల గంజాయి పట్టివేత

సీతానగరం, మార్చి 6: గంజాయితో తమిళనాడుకు చెందిన వ్యక్తిని బుధవారం సీతానగరం పోలీసులు అరెస్టు చేశారు. సీతానగరం ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు పురుషోత్తపట్నం లాంచి రేవు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని విచారించగా అతని వద్ద గల బ్యాగ్‌లో 8 కిలోల గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సరుకును స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిని విచారించగా తమిళనాడు లోని దిండిగల్‌కు చెందినవాడిగా గుర్తించారు. సరుకు విలువ రూ.30 వేల వరకు ఉండవచ్చునని తెలిపారు.

రాజోలులో ఉమ్మడి అభ్యర్థి విజయం ఖాయం

రాజోలు, మార్చి 6: రాబోయే ఎన్నికల్లో రాజోలు నియోజకవర్గంలో టీడీపీ-జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి మన విజయం సాధిస్తారని టీడీపీ సీనియర్ నాయకుడు జగడం సత్యనారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం బి.సావరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు వైఖరి నచ్చకపోవడం వల్లనే ఆయనకు దూరంగా ఉన్నానని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు టీడీపీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు.

ఘనంగా లూర్ధుమాత యాత్ర మహోత్సవం



లూర్ధుమాత యాత్ర మహోత్సవం

యానాం, మార్చి 6: యానాం రోమన్ కేథలిక్ చర్చి ఆవరణలోని లూర్ధుమాత ఆలయంలో బుధవారం యాత్ర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీకగా ఈవేడుక నిలుస్తుంది. క్రైస్తవులే కాకుండా యానాం పరిసర ప్రాంతాల ప్రజలు కులమతాలకు అతీతంగా వచ్చి ప్రార్థనలు చేసి కొవ్వొత్తులు వెలిగించడం ఆనవాయితీగా వస్తుంది. ఆర్‌సీ చర్చి, లూర్ధుమాత ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఎనిమిది రోజులుగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు నవదిన ప్రార్థనలు జరి గాయి. బుధవారం ఉదయం నుంచి చర్చిలో వాక్యపరచర్య, స్వస్థతా ప్రార్థనలు, సమష్టి దివ్యపూజబలి, రాత్రి 7.30కు లూర్ధుమాత పురప్రదక్షణ నిర్వహించారు. పరిపాలనాధికారి మునిస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుర ప్రదక్షణ అనంతరం బాణసంచా కాల్చారు. ఈఉత్సవాలకు సహకారం అందించిన దాతలకు ఆర్‌సీ చర్చి తరపున అభినందనలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను చుట్టుముట్టిన స్థానికులు



ఎమ్మెల్యే చిట్టిబాబును చుట్టుముట్టిన స్థానికులు

అంబాజీపేట, మార్చి 6: మాచవరం పంచాయతీ పరిధిలోని కామయ్యకోడులో రూ.9.50కోట్లతో నిర్మించిన మంచినీటి ప్రాజెక్టు పనులు పూర్తిస్థాయిలో చేపట్టలేదని, పనులు పూర్తి చేసి స్థానిక సమస్యలను పరిష్కరించాకే ప్రాజెక్టును ప్రారంభించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును స్థానికులు చుట్టుముట్టారు. పోతాయిలంక వద్ద నిర్మించిన ప్రాజెక్టును ప్రారంభించేందుకు బుధవారం ఎమ్మెల్యే చిట్టిబాబు వచ్చారు. మంచినీటి చెరువు చుట్టూ రక్షణ లేకపోవడంతో చెరువులో పడి ముగ్గురు మరణించారని ఎమ్మెల్యేకు వివరించారు. ఈప్రాంతంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, స్థానిక సమస్యలు పరిష్కరించాకే మంచినీటి ప్రాజెక్టును ప్రారంభించాలని మహిళలు, స్థానికులు డిమాండ్ చేశారు. దీంతో స్థానికులు, మహిళలతో ఎమ్మెల్యే చర్చించారు. మండల పరిషత్ నిధుల ద్వారా రహదారిని నిర్మించి, చెరువుచుట్టూ రక్షణ కవచం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. అనంతరం మంచినీటి ప్రాజెక్టును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్‌నాగాబత్తుల శాంతకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఏ.పద్మనాభం, జెతఈలు కళ్యాణచక్రవర్తి, చలమయ్య, ఎంపీటీసీ మట్టా పార్వతి, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు పాల్గొన్నారు.

అసమర్థత పాలనతో రాష్ట్రం అప్పులమయం: వేగుళ్ల



అంగరలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ళ

కపిలేశ్వరపురం, మార్చి 6: వైసీపీ ప్రభుత్వం అసమర్థత పాలనతో రాష్ట్రం అప్పులమయంగా మారిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు విమర్శించారు. బుధవారం అంగరలో ఆయన టీడీపీ శ్రేణులతో కలిసి నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీ డిక్లరేషన్‌లో బీసీలరక్షణ చట్టం, 50ఏళ్లకే పింఛన్ రూ.4 వేలు, లాండ్రీలకు 200యూనిట్లు ఉచిత కరెంటు, అనేక సంక్షేమ పథకాల ప్రకటించారన్నారు. టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. గ్రామంలో పర్యటించిన ఆయనకు మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు. టీడీపీ గ్రామఅధ్యక్షుడు సిద్దిరెడ్డి రామలింగేశ్వరరావు ఆధ్వ ర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

4 వేలు జనాభాకు 8,535మంది లబ్ధిదారులా!

పడమరఖండ్రికలో 4వేలు జనాభాకు 8,535మంది లబ్ధిదారులు ఉన్నట్లుగా వైసీపీ ప్రభుత్వం గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బుధవారం గ్రామంలో ఇంటింటా పర్యటించారు. సంక్షేమం కోసం ఖర్చు రూ.27.09కోట్లు, అభివృద్ధి పనుల కోసం చేసిన ఖర్చు రూ.8.44కోట్లు మొత్తం రూ.35.53కోట్లు ఖర్చు చేసినట్టు తప్పుడు లెక్కలతో ఫ్లెక్సీ ఏర్పాటుచేసి ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారన్నారు.అంతటి గ్రామాభివృద్ధి జరిగితే తాను సంతోషిస్తానని, ఖర్చులు వివరంగా చెబితే బాగుంటుందన్నారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వంలో రూ.2.08 కోట్లతో గ్రామాభివృద్ధి చేశానన్నారు. వైసీపీ ప్రభుత్వం గ్రామంలో రూ.1.78కోట్ల పనులు రద్దు చేసిందన్నారు.

అధికారుల గైర్హాజర్‌పై సభ్యుల మండిపాటు

అంబాజీపేట, మార్చి 6: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండలస్థాయి అధికారులు హాజరుకాకపోతే గ్రామసమస్యలను ఎవ్వరికి తెలియజేయాలని మండల పరిషత్ సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి గృహనిర్మాణశాఖ, ఆర్టీసీ, విద్యుత్, ఇరిగేషన్, ఉద్యానశాఖ అధికారులు హాజరుకాకపోవడంపై సభ్యులు మండిపడ్డారు. విద్యాశాఖ ద్వారా చేపడుతున్న నాడు-నేడు పనులు పూర్తిస్థాయిలో జరగడంలేదని ఎంఈవో వెంకటేశ్వరరావును నిలదీశారు. గంగలకుర్రులో డ్వాక్రా నిధులు అవకతవకలపై ఏపీఎం గంగాధర్‌ను ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బిగించవద్దని సమావేశంలో సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. గంటలోపే ముగిసింది. సమావేశంలో జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీడీవో మమత, తహసీల్దారు విమలకుమారి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు యానాం విద్యార్థులు

యానాం, మార్చి 6: బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో ఈనెల10నుంచి 14వరకు జరిగే 68వ జాతీయస్థాయి జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలకు పుదుచ్చేరి జట్టు తరుపున యానాం క్రీడాకారులు బాలురు జట్టులో చోడే గుణశ్యామ్ ప్రతాప్, మహమ్మద్ జాఫర్ అలీ, రేవు బార్గవ సాయి ప్రశాంత్, ఎడ్ల రవికుమార్, రుద్రరాజు షణ్ముఖ వెంకట వర్మరాజు, బాలికల జట్టులో కాపు అనుషా ఎంపికయ్యారని క్లబ్ కార్యదర్శి కాపగంటి అనురాగ ఆదర్శ శేష సుమన్ తెలిపారు. క్రీడాకారులకు క్లబ్ కార్యదర్శి శేష సుమన్, సీనియర్ క్రీడాకారులు రాయపురెడ్డి విజయ్, యడ్ల శాంతి, కర్రీ నుకేష్ వర్మ అభినందనలు తెలిపారు.

● టీడీపీ బీసీ డిక్లరేషన్‌లో వరాల జల్లు
● 50ఏళ్లకే రూ.4వేలు పింఛన్, ప్రత్యేక రక్షణ చట్టం
● టీడీపీ, జనసేన నాయకుల హర్షాతిరేకాలు

బీసీ డిక్లరేషన్‌పై టీడీపీ శ్రేణుల హర్షం





అమలాపురం: మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, కొత్తపేట: సమావేశంలో మాట్లాడుతున్న బండారు సత్యానందరావు

అమలాపురం టౌన్, మార్చి 6: రాష్ట్రంలోనే కాకుండా దేశంలో సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిన ఘనత టీడీపీదేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి పేర్కొన్నారు. బీసీ డిక్లరేషన్‌తో అట్టడుగు బీసీ వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం బీసీ నాయకుల సమావేశాన్ని చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించారు. 50ఏళ్లు నిండిన బీసీలకు రూ.4వేలు పెన్షన్‌తో పాటు బీసీ సబ్ ప్లాన్ ప్రత్యేకంగా అమలు చేస్తామని ప్రకటించడం హర్షణీయమని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి పేర్కొన్నారు. వైసీపీ పాలనలో బీసీలకు కుర్చీలు లేని పదవులు కట్టబెట్టి ఆర్భాటం చేశారని అగ్నికుల క్షత్రియ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు లంకే భీమరాజు పేర్కొన్నారు. బీసీలకు తీరని ద్రోహం చేసిన జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు బీసీలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో టీఎన్టీయూసీ జిల్లా అధికార ప్రతినిధి కాశిన జయనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జి చొల్లంగి సత్యసాయిబాబా, ప్రధాన కార్యదర్శి భాస్కర్ల రామకృష్ణ, కొల్లు విష్ణుమూర్తి, కలిగిత సత్యనారాయణ, యనమదల వెంకటరమణ, కోమలి సత్తిబాబు, నూటుకుర్తి చంటి, కుడుపూడి స్వామి పాల్గొన్నారు.

బీసీలకు వరాల జల్లు

అంబాజీపేట, మార్చి 4: టీడీపీ జయహో బీసీసభలో టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి మేనిఫెస్టోలో భాగంగా బీసీ, బీసీ ఉపకులాలకు ఉపయోగపడే విధంగా అనేక పథకాలను చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ను ప్రవేశపెట్టడం హర్షణీయమని బీసీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు గంగాధరరావు(పెద బాబ) అన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం బీసీలకు 50ఏళ్లకే పింఛన్ అమలు, పింఛన్‌ను రూ.4వేలకు పెంచడం అభినందనీయమన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 34శాతానికి పెంచడం, చంద్రన్న బీమా రూ.10లక్షలకు పునరుద్ధరిస్తామని, పెళ్లికానుకలు రూ.లక్షకు పెంపు చేస్తానని చెప్పడం ఆనందంగా ఉందన్నారు.అనేక పథకాలను మేనిఫెస్టోలో పొందుపరచడం హర్షణీయమన్నారు.

డిక్లరేషన్‌తో బీసీల అభివృద్ధి

కొత్తపేట, మార్చి6: టీడీపీ, జనసేన ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్ అణగారిన వర్గాల అభివృద్ధికి సోపానమని నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం వాడపాలెంలో జరిగిన బీసీ సెల్ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు మొదటి నుంచీ వెన్నుదన్నుగా నిలిచింది టీడీపీయేనన్నారు. నాయకులు యల్లమల్లి జగన్మోహనరావు, కాసా సాగర్, కముజు వెంకటేశ్వరరావు, రెడ్డి తాతాజీ, కముజు గంగాధరరావు, అత్తిలి వెంకటేశ్వరరావు, నారాయణ, ఇళ్ళ మూర్తి పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌పై హర్షం

మామిడికుదురు, మార్చి 6: తెలుగుదేశ, జనసేన పార్టీల అధ్యక్షుడు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు బీసీల కోసం ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అద్భుతంగా ఉందని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ కొనియాడారు. బీసీ డిక్లరేషన్‌పై హర్షం వ్యక్తంచేస్తూ మామిడికుదురులో టీడీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ బీసీలందరూ తెలుగుదేశంతోనే ఉంటారని, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తాననడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు కడలి నూకరాజు, మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి ముఖరం హుస్సేన్ నాయకులు దొంగ సత్తిబాబు, కోలా రాంబాబు, కొండా జగదీష్, పితాని వెంకటేశ్వరరావు, కోళ్ల సురేష్, కొల్లు ఏడుకొండలు, బొక్కా చిన్నా తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అద్భుతం

మలికిపురం, మార్చి 6: బీసీ డిక్లరేషన్‌పై టీడీపీ రాజోలు నియోజకవర్గ బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ ఉపాధ్యక్షుడు ముదునూరి చినబాబురాజు ఇంటి వద్ద పార్టీ మండల అధ్యక్షుడు అడబాల యుగంధర్ అధ్యక్షతన జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో పరిశీలకుడు చిటికెన రామ్మోహనరావు మాట్లాడారు. చంద్రబాబు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అద్భుతంగా ఉందన్నారు. ఎన్నికల వరకు మండల కమిటీల ద్వారా పార్టీని నడిపించాలని తీర్మానించారు. పార్టీకి రాజీనామా చేయకుండా పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న పితాని సూరిబాబు, ఉల్లంపర్తి భాస్కరరావు, బేతినీడి శ్రీనివాసరావు, కేసరి మునీశ్వరరావు, చింతా పండులను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ తీర్మానించారు. సమావేశంలో మంగెన భూదేవి, ముదునూరి చినబాబురాజు, ముప్పర్తి నాని, గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్, మొల్లేటి శ్రీనివాస్, కేతా శ్రీనివాస్, చాగంటి స్వామి, తాడి సత్యనారాయణ, సాగి పాపయ్యరాజు, రుద్రరాజు బంగార్రాజు, ముదునూరి రాంబాబురాజు, అంతర్వేదిపాలెం పుల్లయ్య పాల్గొన్నారు.

మహిళలను ఇబ్బందులకు గురిచేస్తారా!

కొత్తపేట, మార్చి 6: వైసీపీ నాయకులు ప్రచార ఆర్భాటం కోసం పేద మహిళలను ఇబ్బందులకు గురిచేస్తారా అని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. ఇళ్ల స్థలాలు పొందిన వారికి బుధవారం కొత్తపేట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తామని చెప్పి మహిళలను ఇబ్బంది పెట్టారన్నారు. పట్టాల పేరుతో ఒకసారి, పంపిణీ పేరుతో మరొకసారి, రిజిస్ట్రేషన్ పేరుతో ఇంకోసారి సారి, తాజాగా డాక్యుమెంట్ల పంపిణీ అంటూ వైసీపీ నాయకులు మహిళలను కాళ్లు అరిగేలా తిప్పుకుంటున్నారన్నారు. ఊర్ల చివరన నివాసయోగ్యం కాని స్థలాలు ఇచ్చారన్నారు. అధికారులు ఇటువంటి కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని టీడీపీ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, దర్నాల రామకృష్ణ, బండారు వెంకట సత్తిబాబు, గుబ్బల మూర్తి, పల్లి ఏసు కోరారు.

రాజశేఖర్‌కు అభినందనల వెల్లువ

ఐ.పోలవరం, మార్చి 6: పేరాబత్తుల రాజశేఖర్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పదవి లభించడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జి.వేమవరంలో రాజశేఖర్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. చోడిశెట్టి బ్రహ్మానందం, ముంగీ కృష్ణ, పెంట రవి, పేరాబత్తుల బాబీ, మద్దింశెట్టి పురుషోత్తం, లంకలపల్లి బుల్లియ్య, మద్దింశెట్టి దొరబాబు, ఆకుల సత్తిబాబు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

ఉప్పలగుప్తం, మార్చి 6: ఉప్పలగుప్తం పంచాయతీ మధురవారిపేటకు చెందిన మధుర శేషమ్మ (100) బుధవారం మృతి చెందింది. ఆమె 1924 జనవరి 1వ తేదీన జన్మించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. శేషమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, 30 మంది మనుమలు, మునిమనుమలు, మనుమరాళ్లు ఉన్నారు..

టీడీపీ హయాంలోనే అభివృద్ధి

టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి బుచ్చిబాబు



వ్యాపారులను ఓట్లు అడుగుతున్న బుచ్చిబాబు, హరీష్‌మాధుర్

ముమ్మిడివరం, మార్చి 6: టీడీపీ హయాంలోనే ముమ్మిడివరం నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని, వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి శూన్యమని టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో బుధవారం అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. తొలుత పల్లిపాలెంలోని శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకుని పూజలు జరిపి ప్రచారం ప్రారంభించారు. మెయిన్‌రోడ్డులోని లాండ్రీ, టైలరింగ్, కూరగాయలు, కిరాణా, వ్యాపార వర్తక సంస్థల ప్రతినిధులను కలిసి ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కార్యాలయాలకు వెళ్లి కలిసి తమకు ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. ఈసందర్భంగా పలుచోట్ల పార్టీ మేనిఫెస్టో బ్రోచర్లను ఇవ్వడానికి వెళ్లిన దాట్ల బుచ్చిబాబు, గంటి హరీష్‌మాధుర్‌లకు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు.

వైసీపీని గద్దె దింపేందుకు పనిచేయాలి

అవినీతి, అక్రమాలు, అవగాహనా రాహిత్య పాలనతో రాష్ట్రాన్ని అథోగతి పాలు చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యోన్ముఖులై పనిచేయాలని తెలుగుదేశం, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలోని పార్టీ కార్యాలయంలో అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం సాయంత్రం జరిగిన నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన పార్టీల విస్తృతస్థాయి సమావేశంలో బుచ్చిబాబు మాట్లాడారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో నియంత పాలన సాగుతుందన్నారు. బీసీ డిక్లరేషన్ ద్వారా చంద్రబాబు బీసీలకు న్యాయం చేస్తారని, జయహో బీసీ సభలో ప్రకటించిన మేనిఫెస్టో ద్వారా వెల్లడైందన్నారు. అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ కోనసీమను బంగారు సీమగా మార్చాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. ఈకార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, పొద్దోకు నారాయణరావు, అర్థాని శ్రీనివాసరావు, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, మందాల గంగసూర్యనారాయణ, నడింపల్లి సుబ్బరాజు, దాట్ల పృథ్వీరాజ్, తాడి జానకీరామ్, దాట్ల బాబు, ములపర్తి బాలకృష్ణ, కాకర్లపూడి రాజేష్, దాట్ల వర్మ, కడలి నాగు, మాదాల నాగసత్యమంగాకుమారి, కట్టా సత్తిబాబు, దివి మహాలక్ష్మీ, దాసరి జగదీశ్వరి, చిక్కాల అంజిబాబు, యాళ్ల ఉదయ్, గొల్లపల్లి గోపి, బొక్కా రుక్మిణి, గోదశి పుండరీష్, రంబాల రమేష్, జనసేన, టీడీపీ పార్టీల నాయకులు, మందాల గంగసూర్యనారాయణ, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, టేకుమూడి లక్ష్మణరావు, సాగి రాజు సూరిబాబురాజు, పొత్తూరి విజయభాస్కరవర్మ, ములపర్తి బాలకృష్ణ, పిల్లి నాగరాజు, సాకా సీతాదేవి, గుద్దటి జమ్మి, వాసంశెట్టి అమ్మాజీ, ముత్యాల జయలక్ష్మి, దున్నాల నాగమణి, చిక్కాల అంజిబాబు, యాళ్ల ఉదయ్, కురసాల శివబాబు, రంకిరెడ్డి రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

అమలాపురం టౌన్, మార్చి 6: మహిళలపై పెరుగుతున్న దాడులను రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలని మహిళా నేతలు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. అమలాపురం ఎంప్లాయిస్ హోంలో బుధవారం ఐద్వా, సీఐటీయూ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో బండి వెంకటలక్ష్మి అధ్యక్షతన మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యపాన నిషేధం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు మద్యం ఆదాయంతోనే పాలన సాగించడం సిగ్గుచేటని ఐద్వా జిల్లా కార్యదర్శి టి.నాగవరలక్ష్మి పేర్కొన్నారు. మద్యం ఏరులై పారుతుండడంతో మహిళలు అనేక హింసలకు గురవుతున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.కృష్ణవేణి పేర్కొన్నారు. మహిళా సమస్యలపై కలిసికట్టుగా పోరాడాలని మహిళలతో యూటీఎఫ్ నాయకురాలు చంద్రకళ ప్రతిజ్ఞ చేయించారు. ఐద్వా కార్యకర్తలు భవానీ, భువనేశ్వరి, కె.జేబీగంగారత్నం, ఎస్తేరురాణి పాల్గొన్నారు. శ్రీకోనసీమ మహిళా మండలి భవనంలో పచ్చిగోళ్ల సత్యకుమారి అధ్యక్షతన మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బి.పద్మావతి, ఎస్.సరస్వతి, పోలిశెట్టి అనంతలక్ష్మీదేవి, వి.లలితాకామేశ్వరి, ఎన్.వాణి, పి.లలిత, ఎ.జ్యోతి పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కోలా గంగా భవానీ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ బి.పూజ, ఏపీఎం ప్రసాద్, ఐసీడీఎస్ విస్తరణాధికారులు, సీడీపీవో ఐ.విమలకుమారిలు పాల్గొని బాలికలకు అమలవుతున్న బేటీ బచావో, బేటీ పడావో వంటి పథకాలపై వారికి అవగాహన కల్పించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. విస్తరణాధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీవీసీలో బీపీఎల్ క్రికెట్ పోటీలు

అమలాపురం రూరల్, మార్చి 6: భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో బీపీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీరామారావు బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. 15రోజులు పోటీలు జరుగుతాయని ఫిజికల్ డైరెక్టర్లు కరాటం రవిసుధీర్, మురళీకృష్ణ, రవణం మాధమి తెలిపారు. యు.విక్రమ్, జె.సురేష్ అంపైర్లుగా వ్యవహరిస్తారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా సత్యనారాయణ

అంతర్వేది, మార్చి 6: సఖినేటిపల్లి ఎంపీడీవోగా పీవీ సత్యనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గణపవరంలో ఈవోపీఆర్డీగా పనిచేసి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎస్‌పీసీగా ఉన్న మంగాదేవి మలికిపురం మండల ఈవోపీఆర్డీగా వెళ్లారు. సూపరింటెండెంట్ సోమేశ్వరి పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: చారీ 111
వెంకటరమణ	: ఆపరేషన్ వాలంటైన్
శ్రీలలిత	: భూతద్దం భాస్కర నారాయణ
శేఖర్ స్క్రీన్-1	: ఊరిపేరు భైరవకోన
శేఖర్ స్క్రీన్-2	: హనుమాన్
రమా	: గుంటూరు కారం
గణపతి	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటపద్మావతిస్క్రీన్-1	: ఆపరేషన్ వాలంటైన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: డూన్

10న గురుకులంలో ప్రవేశానికి పరీక్ష

పి.గన్నవరం, మార్చి 6: నరేంద్రపురం గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఈనెల10న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పున్నం వేణు తెలిపారు. 5వ తరగతికి ఉదయం 9.30నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్‌కు మధ్యాహ్నం 2నుంచి 4.30గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

నేడు పి.గన్నవరంలో జాబ్‌మేళా

పి.గన్నవరం, మార్చి 6: పి.గన్నవరం లక్ష్మి ఐటీఐ కళాశాల వద్ద గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోక్‌మాన్ తెలిపారు. ఈజాబ్‌మేళాలో 14కంపెనీల్లో 750పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఈఎం ఫార్మసి, పీజీ చేసిన యువతి, యువకులు అర్హులన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం చేయాలి

మలికిపురం, మార్చి 6: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోన్న పథకాలను బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని బీజేపీ కార్యవర్గ రాష్ట్ర సభ్యుడు అడబాల సత్యనారాయణ అన్నారు. బుధవారం మలికిపురంలో కె.కనకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, ఇందుకూరి అచ్యుతరామరాజు, అడబాల రాంబాబు, అడబాల వెంకన్నబాబు, ఆచంట సూర్యజగదీష్, కడియాల కామాక్షీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నామనకు పలువురి పరామర్శ

మామిడికుదురు, మార్చి 6: భార్య వియోగంతో బాధపడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబును పలువురు పరామర్శించి సానుభూతి తెలిపారు. రాంబాబు సతీమణి కృష్ణవేణి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, మాజీ ఎంపీ అయితాబత్తుల బుచ్చిమహేశ్వరరావు, డొక్కా నాథ్‌బాబు, తోలేటి సత్తిబాబు, మోకా ఆనంద్‌సాగర్, మొల్లేటి శ్రీనివాస్, సూదా బాబ్జి, బోనం బాబు, మద్దాల సత్తిబాబు తదితరులు ఉన్నారు.

గంటాలమ్మ ఆలయంలో బండారు పూజలు

ఆత్రేయపురం, మార్చి 6: టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్ బుధవారం నార్కెడుమిల్లిలో పర్యటించారు. గంటాలమ్మ అమ్మవారి ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించారు. మాజీ సర్పంచ్ మద్దింశెట్టి వీరవెంకటసత్యనారాయణ, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు తూము గణేష్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు కరుటూరి రవి పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

అల్లవరం, మార్చి 6: సామంతకుర్రు శివారు ఎస్.రామేశ్వరంలో పార్వతీ రామలింగేశ్వర ఆలయ పనర్నిర్మాణానికి మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి భూమి పూజ చేశారు. దీనికి దేవదాయ శాఖ కామన్‌గుడ్ ఫండ్ నిధులు రూ.50లక్షలు మంజూర య్యాయి. పుల్లేటికుర్తి గౌరీశంకర్, ఫణి హనుమంతు, ఉమాశంకర్, ఆలయ చైర్మన్ అంగాని రామారావు దంపతులు కర్తలుగా హోమాలు జరిగాయి. ప్రజాప్రతినిధులు శిలాఫలకాన్ని ఆవి ష్కరించారు. కొమరగిరిపట్నం సీతారామపురంలో రూ.30లక్షలతో ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, రుద్రరాజు నానిరాజు, సర్పంచ్‌లు కొల్లు వెంకటరమణ, రాకాపు విజయలక్ష్మి, సుందరనీడి సాయి, ఎంపీటీసీలు కర్రి సత్యశ్రీనివాస్, టి.రాజేశ్వరి, దేవదాయ శాఖ జిల్లా అధికారి డి.నాగమల్లేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ జె.రామలింగేశ్వరరావు, ఈవో సలాది సత్యమహేంద్ర పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

మామిడికుదురు, మార్చి 6: వాదబోది డ్రెయిన్‌పై శిథిలస్థితికి చేరిన పాశర్లపూడిలంక, లూటుకుర్రుల మధ్య నిర్మించే వారధి నిర్మాణానికి అమలాపురం ఎంపీ చింతా అనురాధ, మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావులు బుధవారం శంకుస్థాపన చేశారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.కోటి నిధులు మంజూరు చేయించడంతో ఈవారధికి హిమాన్షు శుక్లా రామసేతు వారధిగా నామకరణం చేశారు. జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, సర్పంచ్‌లు తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, అడబాల తాతకాపు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడు ఆలయ నిర్మాణానికి రూ.3లక్షల విరాళం



ఆలమూరు, మార్చి 6: ఆలమూరులో యాదవ సంఘం ఆధ్వ ర్యంలో శ్రీకృష్ణుడు ఆలయాన్ని నిర్మిస్తున్నారు. దీనికి గ్రామానికి చెందిన చెందిన వ్యాపారవేత్త వంటిపల్లి పాపారావు రూ.3లక్షల విరాళాన్ని బుధవారం అందజేశారు. ఆయన్ను యాదవ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు.

రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని నిరసన

మామిడికుదురు, మార్చి 6: లూటుకుర్రులోని భూతాల చెరువు ప్రాంతంలో నిలిపివేసిన రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలంటూ స్థానికులు బుధవారం నిరసన చేపట్టారు. వినతిపత్రాన్ని మంత్రి పినిపే విశ్వరూప్‌కు అందించారు. రొక్కం వినోద్‌కుమార్, రొక్కం కాంతంలు గతంలో రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్నారని, అప్పటి నుంచి వంద మీటర్ల రోడ్డు నిర్మాణం నిలిచిపోయిందన్నారు. సదరు వ్యక్తులు రోడ్డుకు వివిధ రకాల వస్తువులు అడ్డుగా పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వేధింపుల నుంచి విముక్తి కలిగించాలని, రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేవారు. కార్యక్రమంలో టి.బేబికుమారి, జె.జెస్సిక, ఆర్.అనూష, ఆర్.కల్పనారాజ్, ఆర్.కృష్ణరాజు, టీవీ రమణ, యుగంధర్, ఆర్వీలక్ష్మి, యూవీ లక్ష్మి పాల్గొన్నారు.

గరుడేశ్వరస్వామికి వెండి జటా ఝూటం బహూకరణ

పి.గన్నవరం, మార్చి 6: పి.గన్నవరంలో శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత గరుడేశ్వరస్వామి వారికి పి.గన్నవరం గాయత్రి బ్రాహ్మణ సేవాసంఘం సభ్యులు రూ.1.7లక్షల విలువైన వెండి జటా ఝూటం, నాగాభరణం బుధవారం అందించారు. వెండి ఆభరణాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి ప్రసాదరాజు, ఆలయ ప్రధాన అర్చకులు భైరవబోట్ల సత్యవెంకటనారాయణ మూర్తికి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు అందించారు. ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారికి శివరాత్రి గురువారం అలంకరిస్తామన్నారు.

ఇంటి స్థలాల హక్కు పత్రాల పంపిణీ

రామచంద్రపురం, మార్చి 6: స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో పేదలందరికీ ఇల్లు ఇంటి స్థల హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ప్రారంభించారు. అర్హులైన ఇళ్ల స్థలాల పట్టాలు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్‌పర్సన్లు చింతపల్లి నాగేశ్వరావు, కొలమురి శివాజీ, కౌన్సిలర్ వాడ్రేవు సాయి ప్రసాద్, కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

దాతల సాయం మరువలేనిది: ప్రిన్సిపాల్

మండపేట, మార్చి6: మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు అందిస్తున్న సాయం మరువలేనిదని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కె.వి.శ్రీనివాస్ అన్నారు. డిగ్రీకళాశాలకు మాధవి ఎడిబుల్ ఆయిల్ సంస్థ ఎండీ వేగుళ్ల చైతన్యబాబు రూ.30లక్షలతో నూతన గ్రంథాలయాన్ని నిర్మించారు. దీనిని బుధవారం దాతలు చైతన్యబాబు, వేగుళ్ల పట్టాభి రామయ్య ప్రారంభించారు. దాతలు చైతన్యబాబు, పట్టాభి రామయ్యచౌదరిలను అధ్యాపకులు, విద్యార్థులు సత్కరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాదాసీదాగా రావులపాలెం మండల సమావేశం

రావులపాలెం, మార్చి 6: ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకటనాగదేవి అధ్యక్షతన బుధవారం జరిగిన రావులపాలెం మండల పరిషత్ బడ్జెట్ సమావేశం సాదాసీదాగా సాగింది. తొలుత పలు శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన అంశాలను వివరించారు. అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. ఎంపీటీసీలు కూడా కొందరే వచ్చారు. జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీడీవో, తహసీల్దారు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రావులపాలెం, ఫిబ్రవరి 6: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన గోదాశి ప్రవీణ్‌కుమార్ రావులపాలెం నుంచి అంబాజీపేట వెళ్తున్నాడు. వెదిరేశ్వరం శివారు పెంకులపాటి గరువు సమీపానికి వచ్చేసరికి ప్రవీణ్‌కుమార్ బైక్, ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీకొన్నాయి. దీంతో ప్రవీణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కాట్రేనికోన, మార్చి 6: ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ బుధవారం కందికుప్ప, మొల్లేటిమొగ, కొత్తపాలెం, పల్లం, చెయ్యేరు, చెయ్యేరుఅగ్రహారం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. కొప్పిగుంట, బక్కివారిపేట, పోరగరువు, చింతలమెరకల్లో సచివాలయ భవనాలు, జలజీవనమిషన్ పనులు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పాలెపు లక్ష్మీధర్మారావు, జడ్పీటీసీ నేల కిశోర్‌కుమార్, నడింపల్లి సూర్యనారాయణరాజు, కాశి మునికుమారి, నాతి సత్యనారాయణ పాల్గొన్నారు.

13నుంచి యానాంలో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

యానాం, మార్చి6: పుదుచ్చేరి ప్రభుత్వ ఆరోగ్యశాఖ ద్వారా ఈనెల 13తేదీ నుంచి మూడు రోజులు యానాం ప్రభుత్వాసుపత్రిలో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు (ఐక్యాంప్) నిర్వహిస్తున్నట్టు డీడీ టి.రవిశంకర్ తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం 15వ తేదీ మధ్యాహ్నం నుంచి అంధత్వ ధ్రువీకరణ ప్రతాలు జారీ చేస్తామన్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డ్, ఆయుష్మాన్ భారత్ కార్డును తీసుకు రావాలన్నారు. ఆయుష్మాన్‌కార్డు లేనివారు ప్రభుత్వాసుపత్రిలో నమోదు చేసుకుని కార్డు పొందాలన్నారు. శస్త్ర చికిత్సలు చేయించుకునే వారు ఈనెల 12లోగా యానాం ఆసుపత్రిలో ఉచిత రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు.

మంచినీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉంచాలి

అయినవిల్లి, మార్చి 6:మంచినీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులకు, ట్యాంకు వాచర్లకు ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి బుధవారం సూచించారు. మండలంలో 21పంచాయతీల పరిధిలో 38ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను పరిశుభ్రం చేశారు. ఓహెచ్ఎస్సార్ ట్యాంకులను పరిశీలించారు. డ్వామా పీడీ మధుసూదన్, మండల ప్రత్యేకాధికారి వై.సత్యనారాయణ, తహసీల్దార్ ప్రమద్వర, ఈవోపీఆర్డీ కేవీఎస్ మోహనకృష్ణ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు ప్రారంభం

కపిలేశ్వరపురం, మార్చి 6: అంగరలో ఎంపీలాడ్స్ రూ.10లక్షలతో నిర్మించిన పద్మశాలి కమ్యూనిటీ హాలును అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ తోట తనయుడు పృధ్వీరాజ్ బుధవారం ప్రారంభించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణిదుర్గారావు, జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, గ్రామసర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ లు అద్దాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు పాల్గొన్నారు.